తరగని భక్తజనం



సిరిమాను చెక్కకు పోటీ పడుతున్న భక్తులు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి తొలేళ్లు, సిరిమానోత్సవం సోమ, మంగళవారాల్లో అత్యంత భక్తిశ్రద్ధల నడుమ జరిగాయి. లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారు బుధవారం సైతం బారులు తీరి పైడితల్లమ్మా.. కరుణించమ్మా.. అంటూ వేడుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రైల్వేస్టేషన్ సమీపంలోని వనంగుడిలోనూ భక్తుల సందడి కనిపించింది.

సిరిమాను చెక్క కోసం

ఉత్సవం అనంతరం సిరిమానును చదురుగుడి ముందు ఉంచారు. బుధవారం ఉదయం నుంచి సిరిమానుకు, అక్కడ ప్రతిష్ఠించిన ఘటాలకు భక్తులు పూజలు చేశారు. పవిత్రమైన సిరిమాను చెక్క కోసం పోటీపడ్డారు. అది ఇంట్లో ఉంచుకుంటే ధనధాన్యాలు సమృద్ధిగా లభిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

రెండు ఇసుక రీచ్‌లు ప్రారంభం



తమరాంలో కొబ్బరికాయ కొట్టి రేవును ప్రారంభిస్తున్న డీడీ

విజయనగరం అర్బన్, సంతకవిటి, న్యూస్‌టుడే: తెర్లాం, సంతకవిటి మండలాల్లో రెండు ఇసుక రీచ్‌లు ప్రారంభించినట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. దీంతో తగినంత ఇసుక అందుబాటులోకి రానుందన్నారు. వాగులు, గెడ్డల సమీపంలో ఉన్న మూడో శ్రేణి రీచ్‌ల నుంచి మాత్రమే ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా సొంత అవసరాలకు తీసుకెళ్లేందుకు అనుమతి ఉందని, దీన్ని వ్యాపారంగా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వంతెనలు, తాగునీటి పథకాల వద్ద తవ్వకాలు నిషేధమని పేర్కొన్నారు.

◆ రేవుల నుంచి పారదర్శకంగా ఇసుక విక్రయాలు చేపడతామని జిల్లా గనుల శాఖ డీడీ ఇ.నర్సింహరెడ్డి తెలిపారు. సంతకవిటి మండలం తమరాం సమీపంలోని రేవును బుధవారం ప్రారంభించారు. నాగావళిలోని ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో 48 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని చెప్పారు. తహసీల్దార్ సత్యం, నాయకులు కోండ్రు జగదీశ్, ఎంపీటీసీ సభ్యుడు వి.గణేష్ పాల్గొన్నారు.

నేడు మంత్రి కొండపల్లి పర్యటన

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు గుర్లలో డయేరియాతో మరణించిన వారి కుటుంబాలను, బాధితులను పరామర్శిస్తారు. 10.30 గంటలకు బొండపల్లి మండలం గొల్లుపాలెం, 11.30 గంటలకు మరువాడ, మధ్యాహ్నం 3 గంటలకు గజపతినగరం మండలం పురిటిపెంట, 3.45 గంటలకు మల్లునాయుడిపేట, 4.30 గంటలకు మరుపల్లి గ్రామాల్లో పల్లె పండగలో పాల్గొంటారు.

ఉపాధిలో.. అవినీతి జలగలు

పంచాయతీలో అడుగుపెట్టిన డీఆర్పీలకు ఆ పరిధిలో రూ.కోటి లోపు పనులు జరిగితే రూ.10 వేలు, రూ.కోటి దాటితే రూ.18 వేలు చొప్పున క్షేత్రస్థాయి సహాయకులు (ఎఫ్ఏ) ఇవ్వాల్సిందేనట.

సామాజిక తనిఖీకి ఒక్కో మండలం నుంచి ఓ అధికారికి రూ.50 వేలు, ఎస్సార్పీకి రూ.50 వేలు ముట్టజెప్పాల్సిందేనట. ఈ మొత్తాన్ని మండలంలో ఏపీవోతో పాటు పనిచేసే పది మంది ఉద్యోగులు రూ.10 వేలు చొప్పున వసూలు చేయాలట.

ఇదేమిటి అనుకుంటున్నారా.. సామాజిక తనిఖీల సమయంలో అవినీతి బయటపడకుండా ఉండాలంటే ఇలా చేయితడపాల్సిందేనట.

మండలాల వారీగా సామాజిక తనిఖీ చేపడుతున్నారంటే ఆ పంచాయతీలో చేపట్టిన పనుల మొత్తం విలువను బట్టి మూడంచెల్లో చేతులు తడపాలని ఉద్యోగుల ఆవేదన.

సంవత్సరాల వారీగా నిధుల వినియోగం (రూ.కోట్లలో)

పంచాయతీలు	2022-23	2023-24
776	869.27	509.28

ఈనాడు–విజయనగరం



కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయం

పేదలకు తిండి పెట్టే ఉపాధి హామీ పథకం గత ప్రభుత్వంలో అవినీతి అధికారుల కడుపు నింపింది. ఓ అధికారి నుంచి.. కింది స్థాయి సిబ్బంది వరకు అందినంత దోచుకున్నారు. ఆ అధికారి అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తినా ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడంతో కనీస చర్యలు శూన్యం.

జిల్లా మొత్తం మీద తొలి విడత తనిఖీల సమయంలో సుమారు రూ.2 కోట్లు, రెండో విడతలో రూ.కోటికి పైగా ముడుపులు ఇచ్చారని సమాచారం. మూడో విడతకు కూడా పది మండలాల్లో వసూళ్లు చేసి ఇచ్చారట. ఇది ఎవరో చెప్పింది కాదు.. డ్వామా ఉద్యోగుల మాట. తప్పనిసరి పరిస్థితుల్లో అధికారుల బెదిరింపులకు భయపడి మండలాల నుంచి వసూళ్లు చేసి ముట్టజెప్పినట్లు కొందరు ఏపీవోలే బహిరంగంగా చెబుతున్నారు.

గతంలో పనిచేసిన ఓ అధికారి హయాంలో జరిగిన 63 సామాజిక తనిఖీలకు ముందు రోజే రూ.50 వేల చొప్పున ఇచ్చినట్లు కొందరు ఉద్యోగులు పేర్కొనడం గమనార్హం. ఆ 63 చోట్ల ఇప్పుడు మళ్లీ నిర్వహిస్తే కుప్పలు తెప్పలుగా అవినీతి, అక్రమాలు బయటపడతాయని, ప్రభుత్వానికి సైతం రూ.కోట్లలో రికవరీ అవుతుందని అంటున్నారు.

రికవరీ నామమాత్రమే

సామాజిక తనిఖీల్లో బయటపడిన అక్రమాల మేరకు రికవరీ చేయాలి. ఇది నామమాత్రంగా 0.01 శాతం నమోదు చేసి మమ అనిపించారు. 2022-23లో చేపట్టిన పనులకు రూ.869.27 కోట్లు, 2023-24లో రూ.509.28 కోట్లు వెచ్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది మండలాల్లో వెచ్చించిన రూ.160.26 కోట్ల విలువైన పనులపై సామాజిక తనిఖీలు పూర్తి చేశారు. ఉపాధి హామీ మట్టి పనులకు సంబంధించి సామాజిక తనిఖీలో కనీసం పది శాతం తేడా.. కొన్ని చోట్ల అంతకన్నా ఎక్కువే బయటపడుతుంది. ఆ తేడానే రికవరీ కింద వసూలు చేస్తారు. 2022-23 నుంచి ఇప్పటి వరకు జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.20 లక్షల లోపే రికవరీ కేసులు గుర్తించారు.

ఆడిటర్లకూ ఇవ్వాలట..

పంచాయతీరాజ్ శాఖ కమిషనరేట్ కార్యాలయం నుంచి వచ్చిన ఉద్యోగులు రెండు మండలాల్లో గత నెలలో ఆడిట్ చేశారు. వీరి పేరిట ఏపీవోల ద్వారా రూ.10 వేల చొప్పున వసూళ్లు చేయించారని డ్వామా ఉద్యోగులే చెబుతున్నారు. రెండు మండలాల్లో ఆడిట్ జరిగితే, అన్ని చోట్ల నుంచి వసూళ్లు చేయడంలో ఇద్దరు వ్యక్తులు కీలకంగా వ్యవహరించారు. అసలు ఆ ఆడిట్ ఉద్యోగులకు రూపాయి కూడా ఇవ్వకుండా ఓ అధికారి తినేసినట్లు చెప్పుకొస్తున్నారు. ◆ సామాజిక తనిఖీలకు వచ్చే డీఆర్పీలు, ఇతర సిబ్బందికి ఒక్కో మండలంలో 12 రోజుల పాటు జరిగే లావాదేవీలను నిశితంగా పరిశీలించి లోపాలు గుర్తిస్తారు. ఇందుకు ప్రభుత్వమే రూ.1.20 లక్షలు చెల్లిస్తోంది.

దృష్టి సారిస్తా జిల్లా నీటి యాజమాన్య సంస్థలో అక్రమాలు జరిగాయని ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనూ ఫిర్యాదులు అందాయి. వాటిపై దృష్టి సారిస్తా. అవసరమైతే మరోసారి సామాజిక తనిఖీలు సహా విచారణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటా. – డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, కలెక్టర్, డ్వామా ఛైర్మన్

విమానాశ్రయం పనుల పరిశీలన



నిర్మాణ ఆకృతిని ఎంపీ శ్రీభరత్‌కు చూపిస్తున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు

పూసపాటిరేగ/భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం విమానాశ్రయం అభివృద్ధి పనులను ఎంపీ శ్రీభరత్, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, తెదేపా విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జి బుధవారం పరిశీలించారు. విమానాశ్రయ నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ ప్రస్తుత పనులు, డిజైనింగ్, భవిష్యత్తు ప్రణాళికలపై సూచనలు చేశారు. రాబోయే 50 ఏళ్లను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయం నిర్మించాలన్నారు. విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి రాకపోకలు సులభతరం చేసే మార్గాలు గురించి అడిగి తెలుసుకొన్నారు. ప్రస్తుతం విమానాశ్రయ పనులు 45 శాతం పూర్తయ్యాయని ఆయనకు వివరించారు. డిసెంబరు నుంచి ఏటీసీ టవర్ పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు.

కోపా.. కొత్త కొలువుల లోకం



– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు ఇలా..

ఐటీఐ	విజయనగరం	సీతంపేట	రాజాం	సాలూరు
సీట్లు	48	48	48	48
చేరినవారు	48	48	48	23

- ఈ కోర్సుకు పెరుగుతున్న డిమాండు
- కొన్ని కళాశాలల్లో వందశాతం సీట్ల భర్తీ

ఐటీఐ పేరు చెప్పగానే ఒకప్పుడు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్ల పేర్లే ఎక్కువగా వినిపించేవి. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలను దృష్టిలో పెట్టుకుని కంప్యూటర్ కోర్సు (కోపా) అందుబాటులోకి రావడంతో అభ్యర్థులు మొగ్గు చూపుతున్నారు. గత రెండేళ్లుగా ప్రవేశాలకు డిమాండు పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వ విద్యకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది కొన్ని కళాశాలల్లో వందశాతం సీట్లు భర్తీ అయ్యాయి. అంటే ఆ స్థాయిలో డిమాండు ఉందన్నమాట.

పదో తరగతి అర్హతతోనే..

వాస్తవానికి కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్) కోర్సును 2002లోనే అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో చేరేందుకు తొలుత ఇంటర్మీడియట్ విద్యార్హతగా ఉండేది. తర్వాత కాలంలో పదో తరగతికి తగ్గించారు. ప్రారంభంలో ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఈ కోర్సు ఉందని కూడా చాలామందికి తెలియని పరిస్థితి. కొన్నేళ్లుగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పెద్దఎత్తున చేరుతున్నారు. రెండు జిల్లాల్లో ఆరు ప్రభుత్వ ఐటీఐలున్నాయి. బొబ్బిలి, భద్రగిరి తప్ప.. మిగిలిన నాలుగింట్లో చేరేందుకు అవకాశం ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో నాలుగో విడత కౌన్సెలింగ్ తర్వాత 192 సీట్లలో 167 మంది చేరడం గమనార్హం.



విజయనగరంలోని ప్రభుత్వ ఐటీఐలో ఆన్‌లైన్ తరగతుల్లో అభ్యర్థులు

ప్రైవేటులోనూ..


ప్రైవేటులోనూ ప్రవేశాలు పెరిగాయి. గతంలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ కోర్సులే ఉండేవి. రెండేళ్లుగా ఆన్‌లైన్ పరీక్షల విధానం అమల్లోకి రావడం, మారుతున్న కాలానుగుణంగా కంప్యూటర్ కోర్సులు పెడుతున్నారు. చెల్లూరు, కొత్తవలస, గజపతినగరం, ఎల్.కోట మండలాల్లో ప్రస్తుతం కోపా తరగతులు సాగుతున్నాయి. చెల్లూరు ప్రైవేటు కళాశాలలో 24 సీట్లకు 14, కొత్తవలసలో 9, ఎల్.కోటలో 13 మంది ప్రవేశాలు పొందారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీల చూపు..

ఇటీవల సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఐటీఐల లక్ష్యంగా ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నాయి. మేళాల ద్వారా అవకాశాలు కల్పిస్తున్నాయి. జులైలో టీసీఎస్, టెక్ మహీంద్ర వంటి కంపెనీలు నిర్వహించిన ఎంపికల్లో విజయనగరం ప్రభుత్వ ఐటీఐలో 33 మంది అభ్యర్థులకు ఉపాధి, ఓజేటీ(మూడు నెలల శిక్షణ అనంతరం ఉపాధి పొందేలా) అవకాశాలు లభించాయి. డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నీషియన్లు వంటి పోస్టులకు వీరిని ఎక్కువగా తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఐటీఐ కంప్యూటర్ చేసే వారికి అప్రెంటీస్‌షిప్ అవకాశాలున్నాయి.

సీనియర్ల ద్వారా తెలుసుకున్నా..





కోపా కోర్సు గురించి గతంలో ఎవరికీ తెలియదు. సీనియర్లతో చర్చించి, విద్య, ఉపాధి అవకాశాలు గురించి తెలుసుకున్నాం. కంపెనీల్లోనే కాకుండా కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు, అప్రెంటీస్ అవకాశాలు ఉండటంతో ప్రవేశాలు పొందాం. తరగతులు బాగా జరుగుతున్నాయి.

- దిల్షన్, విజయలక్ష్మి

తొలిసారిగా అప్రెంటీస్



రైల్వే, హెచ్ఏఎల్, డీఆర్‌డీవో, నేవీలో రెండేళ్లుగా అప్రెంటీస్ అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రైవేటు కంపెనీలు సైతం పెద్దఎత్తున ముందుకు వస్తున్నాయి. పదో తరగతి వారే కాకుండా ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కూడా ప్రవేశాలు పొందారు.

- టి.వి.గిరి, కన్వీనరు, ఐటీఐ విద్య

ఉచిత బియ్యం.. మరో నాలుగేళ్లు!

ఉమ్మడి జిల్లాలో 8,09,831 మందికి లబ్ధి



రేషన్ వాహనం ద్వారా పంపిణీ

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచిత బియ్యం అందజేస్తోంది. కరోనా విపత్తు కాలం 2020 ఏప్రిల్ నుంచి అమలవుతోంది. కుటుంబంలో ఒకరికి అయిదు కిలోల చొప్పున ఇస్తున్నారు. తొలుత రెండేళ్లు అని ప్రకటించినా పొడిగిస్తూ వచ్చింది. మళ్లీ 2028 వరకు పథకాన్ని కొనసాగిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలే ప్రకటించారు. దీంతో పేదలకు ఇంకో నాలుగేళ్లు ఉచిత బియ్యం అందనున్నాయి.

జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద రేషన్ కార్డుదారులకు ఈ పథకం వర్తిస్తోంది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 8,62,939 మంది కార్డుదారులు ఉండగా ఇందులో ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుదారులు 8,09,831 మంది ఉన్నారు. వీరందరికీ ప్రయోజనం కలగనుంది. రెండు జిల్లాల కార్డుదారులకు నెలకు 14,374.93 మె.ట. బియ్యం అవసరం. మిగిలిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. ఇటువంటి వారు ఉమ్మడి జిల్లాలో 53,108 మంది మాత్రమే ఉన్నారు. తెదేపా హయాంలో రూపాయికి కిలో బియ్యం పథకం అమలయ్యేది. కేంద్రం ఉచితంగా అందజేస్తున్నందున గత ప్రభుత్వం 2023 జనవరి నుంచి ఈ పథకాన్ని నిలిపివేసి, ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులు లేని వారికి బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మధుసూదనరావు తెలిపారు.

జిల్లా	మొత్తం కార్డులు	ఎన్ఎఫ్ఎస్ఏ	నెలవారీ కేటాయింపు (మె.ట.)
విజయనగరం	5,81,688	5,47,098	9,159.765
మన్యం	2,81,251	2,62,733	5,215.165

దుకాణం దొరకలే

ఎక్కువ అద్దె డిమాండ్



ఈనాడు–విజయనగరం

ఉమ్మడి జిల్లాలో లాటరీ ద్వారా మద్యం దుకాణాలు పొందిన వారు బుధవారం నుంచి తెరుచుకోవచ్చు. విజయనగరం జిల్లాలో 153, మన్యం జిల్లాలో 52 దుకాణాల్లో అమ్మకాలకు ఎక్సైజ్ అధికారులు అనుమతి ఇచ్చారు. చాలా మందికి దుకాణాలు దొరకలేదు. విజయనగరం, పార్వతీపురం, సాలూరు సహా పురపాలక, పట్టణ ప్రాంతాల్లో, మండల కేంద్రాల్లో పెద్ద మొత్తంలో అద్దె డిమాండ్ చేస్తున్నారు. విజయనగరంలో నెలకు రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేల నుంచి రూ.40 వేలు అడుగుతున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ మద్యం దుకాణాలను కొంతమంది తీసుకున్నారు.

రూ.8 కోట్ల సరకు విడుదల

ఉమ్మడి జిల్లాలో 205 దుకాణాలున్నాయి. వీటిలో పూర్వపు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని 173 దుకాణాలకు నెల్లిమర్ల ప్రభుత్వ మద్యం డిపో నుంచి సరకు సరఫరా అవుతోంది. మిగిలిన వాటికి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల డిపో నుంచి పంపిస్తారు. బుధవారం రాత్రి 7 గంటల వరకు 173 దుకాణాల్లో 101 దుకాణాలకు సరకు తీసుకెళ్లారు. తొలి రోజు రూ.8 కోట్ల విలువైన 11,637 మద్యం బాక్సులు విడుదల చేశారు. మరికొందరు నగదు చెల్లించి ఇండెంట్ సిద్ధం చేసుకున్నారు. ఏ క్షణంలో దుకాణం దొరుకుతుందో ఆ మరుక్షణం తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

జే బ్రాండ్లకు చెల్లు

వైకాపా ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యం తాగి ఆరోగ్యం గుల్ల చేసుకున్నారు. పాత సరకు కాకుండా నాణ్యమైన కొత్త బ్రాండ్లు అందుబాటులోకి తీసుకొస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. క్వార్టర్ బాటిల్ రూ.99కు విక్రయిస్తామని ప్రకటించింది. ఒకటి, రెండు రోజుల్లో కనిష్ఠ ధరకు దొరికే మద్యం సీసాలు వస్తాయని నెల్లిమర్ల ప్రభుత్వ మద్యం డిపో మేనేజరు గౌరీశ్వరరావు 'ఈనాడు'కు తెలిపారు.

మంచం పట్టిన గుర్ల

అతిసారానికి కలుషిత నీరే కారణమని ప్రాథమిక అంచనా

న్యూస్‌టుడే – గరివిడి, గుర్ల: మండల కేంద్రం గుర్లను కుదిపేసిన అతిసారానికి కలుషిత నీరే కారణమని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. గ్రామంలో నాలుగు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారిలో ఐదుగురు మృతి చెందడంతో సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే కళా వెంకటరావు ఆదేశించారు. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు రక్షిత పథకాలు, బోరు బావులు, ప్రైవేటు బోర్ల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. ఇంత వరకు లభించిన ప్రాథమిక ఫలితాల ప్రకారం కలుషిత నీరే కారణంగా భావిస్తున్నట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు.



చీపురుపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

చంపావతిలోని ఊటబావి, గుర్లలో ప్రజలు వినియోగిస్తున్న ఐదు ప్రైవేటు బోర్ల నీటిని పరీక్షించగా కలుషితమైనట్లు తేలిందంటున్నారు. గ్రామంలో భూగర్భ జలాలు కలుషితం కావడంతో ఊరు మొత్తం వ్యాధి వ్యాప్తి చెందినట్లు బుధవారం గుర్లలో పర్యటించిన కలెక్టర్ అంబేడ్కర్‌కు అధికారులు వివరించారు. అతిసారంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు తోడు కావడంతో ఐదుగురు మృతి చెందినట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వానికి నివేదించింది.

మరణాలపై చంద్రబాబు ఆరా

ఐదుగురు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం బాధితుల పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవలు, గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన అదుపులోకి తీసుకువచ్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశాలిచ్చారు.


మూడు రోజుల్లో 143 కేసులు

వ్యాధిని అదుపులోకి తీసుకురావడానికి అధికార యంత్రాంగం ముమ్మరంగా చర్యలు చేపట్టింది. గుర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 24 గంటలు సేవలు అందిస్తున్నారు. మంగళవారం రాత్రికి 27 మంది రోగులు ఉండగా బుధవారం అదనంగా మరో 19 మంది వ్యాధి బారినపడ్డారు. గడిచిన మూడు రోజుల వ్యవధిలో గ్రామంలో 143 అతిసారం కేసులు నమోదైనట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరంలో 50 మంది, గుర్ల పీహెచ్‌సీలో 9 మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. లక్షణాలు తగ్గుముఖం పట్టి ఇంటికి వెళ్లిన వారి నుంచి మరి కొందరికి వ్యాధి సోకుతుందని.. ఈ కారణంగానే బాధితుల సంఖ్య పెరుగుతుందని వైద్యాధికారులు గుర్తించారు. పూర్తిగా తగ్గే వరకు బాధితులను ఇంటికి పంపకుండా చర్యలు తీసుకుంటున్నారు. వ్యాధి తీవ్రత ఉన్నవారిని మెరుగైన వైద్యం కోసం తరలించేందుకు చీపురుపల్లి ప్రభుత్వ ప్రాంతీయాసుపత్రిలో 20, నెల్లిమర్ల మిమ్స్‌లో 30 పడకలను ముందు జాగ్రత్తగా సిద్ధం చేశారు. ప్రస్తుతం విజయనగరం, నెల్లిమర్ల ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు చెబుతున్నారు. గుర్లలో అల్పాహారం, రెస్టారెంట్లు, మాంసం, చేపల దుకాణాలన్నీ మూయించారు.

పునరావృతం కానివ్వొద్దు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గుర్లలో చోటు చేసుకున్న డయేరియా ఘటనపై యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాలో ఇటువంటి ఘటనలు ఎక్కడా పునరావృతం కాకూడదని కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ స్పష్టం చేశారు. గురువారం నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య (శానిటేషన్) కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశమున్నందున అధికారులు అప్రమత్తం కావాలని, తాగునీటి ట్యాంకులు, రక్షిత పథకాలు క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి పరిస్థితి తెలుసుకోవాలని సూచించారు. చంపావతి నీటి ప్రవాహంలో జంతు కళేబరాలు కొట్టుకు రావడంతో నీరు కలుషితమై గుర్లలో అతిసారం ప్రబలినట్లు వస్తున్న వదంతులు ప్రజలు నమ్మొద్దని, నీటి పరీక్షల్లో కలుషితం కాలేదని తేలిందని పేర్కొన్నారు.

పైడితల్లి ఆలయానికి రూ.2.40 లక్షల విరాళం



అదితి చేతుల మీదుగా విరాళాన్ని అందజేస్తున్న కామేశ్వరరావు కుటుంబ సభ్యులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: పైడితల్లి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామానికి చెందిన మాకం కామేశ్వర రావు, అతని కుమారులు రూ.2.40 లక్షల విరాళాన్ని అందజేశారు. బుధవారం అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అదితి గజపతి రాజు చేతుల మీదుగా ఆలయ కార్యనిర్వహణ అధికారికి ఇచ్చారు. పెద్ద చెరువులో బెస్తవారి వలలో అమ్మవారి విగ్రహం ప్రత్యక్షమైందని, వారే మొదటగా విరాళాన్ని ఇవ్వడం సంతోషదాయకమని ఎమ్మెల్యే వారిని అభినందించారు. కార్యక్రమంలో కమ్మవీధికి చెందిన అమ్మవారి బెస్తవారి వల ఉత్సవ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఐదు తరగతులు.. ముగ్గురే విద్యార్థులు



జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఎ.రావివలస పంచాయతీ నారుపేట ప్రాథమిక పాఠశాల రేకుల షెడ్డులో కొనసాగుతోంది. ఐదు తరగతులకు అనుమతి ఉన్నప్పటికీ ప్రస్తుతం ముగ్గురే విద్యార్థులున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భవనం కోల్పోవడంతో ఒక్కొక్కరిగా ఈ పాఠశాలను వీడి విద్యార్థులు ఇతర విద్యాలయాలకు వెళ్లిపోయారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని, వసతి సమస్య వల్ల చేరడం లేదని ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు తెలిపారు. దీనిపై ఎంఈవో రమణమూర్తి వద్ద ప్రస్తావించగా ఇక్కడ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. – న్యూస్‌టుడే, భోగాపురం

జీవనోపాధులు కల్పించే దిశగా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద అన్ని వర్గాలకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కార్యాలయ సమావేశ మందిరంలో ఐటీడీఏ, డీఆర్‌డీఏ, పశుసంవర్ధక శాఖ, జీసీసీ, పరిశ్రమల శాఖ అధికారులతో మాట్లాడారు. ఉపాధి కల్పన పథకాల ద్వారా లబ్ధిదారులు స్థిర ఆదాయాన్ని పొందేలా చూడాలన్నారు. రెండు ఐటీడీఏల పరిధిలోని వన్‌ధన్ వికాస కేంద్రాలు స్ఫూర్తివంతంగా పనిచేయాలన్నారు. ఈ నెలాఖరుకు ప్రతి మండలంలో ఒక యూనిట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, నవంబరు 17 నాటికి ప్రారంభించాలన్నారు. 500 కుటుంబాలకు గొర్రెల పెంపకం ద్వారా ఉపాధి కల్పించేలా ప్రణాళిక అమలు చేయాలన్నారు. ఏపీవోలు చినబాబు, మురళీధర్, జీసీసీ డీఎం మహేంద్రకుమార్, పరిశ్రమల శాఖ అధికారి కరుణాకర్, పశుసంవర్ధక శాఖ ఏడీ మన్మథరావు, డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు పాల్గొన్నారు.

వచ్చే జనవరికి పనులు పూర్తవ్వాలి




శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్, ఎమ్మెల్యే నాగమాధవి

డెంకాడ, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో కొత్తగా మంజూరు చేసిన అభివృద్ధి పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా డెంకాడ మండలం పెదతాడివాడలో రూ.15 లక్షల వ్యయంతో సీసీ రహదారి నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే నాగమాధవితో కలసి శంకుస్థాపన చేశారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో మొత్తం 265 పనులకు సుమారు రూ.24 కోట్లు కేటాయించారని, మిగిలిన పనులకు రెండో విడతలో మంజూరు చేస్తామన్నారు. ఎంపీపీ బి.వాసుదేవరావు, డ్వామా పీడీ సందీప్, ఎంపీడీవో భవానీ, తహసీల్దారు పద్మావతి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

సృజన.. విజ్ఞాన శోధన



విద్యార్థులు తమ సృజనకు పదును పెడుతున్నారు. ఆలోచనలను ప్రాజెక్టులుగా ఆవిష్కరిస్తున్నారు. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు అద్దం పడుతున్నాయి. ఇటీవల జరిగిన విజయనగరం ఉత్సవాల్లో భాగంగా జిల్లాకు చెందిన పలు పాఠశాలల వారు వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించి ఔరా అనిపించారు.

– న్యూస్‌టుడే, విద్యావిభాగం, ఉడాకాలనీ

ఏఐతో సాంకేతిక ఇల్లు



కృత్రిమ మేధ పరిజ్ఞానంతో సాంకేతిక ఇంటిని రూపొందించాం. వృద్ధులు, దివ్యాంగులకు ఉపయోగపడేలా తయారు చేశాం. ఇంట్లో ఉండే వివిధ రకాల పరికరాల(పంకాలు, శీతలీకరణ యంత్రాలు తదితరాలు)ను నియంత్రించడం ద్వారా విద్యుత్తు ఆదా చేయవచ్చు. మన మాటల ద్వారా కార్యకలాపాలు సాగించవచ్చు. – బి.లోకేశ్, కె.యామిని, ఎం.వైష్ణవి, మహారాజా ఎయిడెడ్ కళాశాల

గాలి కాలుష్య నివారణ ఇలా..



ప్రపంచవ్యాప్తంగా గాలి కాలుష్యం బారిన పడి ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రధానంగా కర్మాగారాల్లో వచ్చే విషపూరిత వాయువులు గాలిని కలుషితం చేస్తున్నాయి. మానవులతో పాటు పశుపక్ష్యాదులు మరణిస్తున్నాయి. వాహనాల ఉపయోగాన్ని తగ్గించి, చెట్లను నరకకుండా చూడడం ద్వారా భవిష్యత్తులో ఈ కాలుష్యం నుంచి బయటపడే విధానాన్ని ప్రయోగపూర్వకంగా తెలియజేశాం.

– ప్రవల్లిక, వేణుమాధవి, 8వ తరగతి, గాజులరేగ జడ్పీహెచ్‌ఎస్

రైలు ప్రమాదాల నివారణ



ఇటీవల కాలంలో రైలు ప్రమాద ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ఇలాంటి వాటిని నివారించే విధానాన్ని ప్రాజెక్టు రూపంలో తెలియజేశాం. సెన్సర్లు ఉపయోగించి ప్రమాదాలు జరగకుండా చూడొచ్చు. ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు వచ్చేటప్పుడు ముందస్తుగా సిగ్నళ్లు వచ్చేలా వివిధ రకాల పరికరాలు పెట్టాం. దీంతో ముందుగానే అప్రమత్తం కావొచ్చు.

– బి.చరిష్మా, ఎన్.దీపిక, పదో తరగతి, అక్లాండ్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, పూసపాటిరేగ

మనుషులతో పనిలేకుండా..



ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఆహార పదార్థాలు గానీ, యంత్రాలు, ఇతరత్రా పరికరాలను ఆర్డరు చేస్తే మానవ ప్రమేయంతో అందిస్తున్నారు. మా ప్రాజెక్టుతో మానవ ప్రమేయం లేకుండా ఆయా పనులు చేపట్టవచ్చు. పెట్రోల్, డీజిల్‌తో పాటు సోలార్ ఉపయోగించి సెన్సర్లు, కంప్యూటర్ కోడింగ్ ద్వారా నిర్వహించే విధానాన్ని రూపొందించాం. – వినయ్‌రెడ్డి, కృష్ణ సమీర్, ఏఐఏటీ జూనియర్ కళాశాల, విజయనగరం

ఈ-వాహనాలు



పెట్రోల్, డీజిల్‌తో నడుస్తున్న మోటారు వాహనాలతో కాలుష్యం పెరుగుతోంది. పర్యావరణ పరంగా హాని జరుగుతున్నందున వాటి స్థానంలో విద్యుత్తు వాహనాలు ఉపయోగించాలి. తద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ- వాహన పథకం కింద ఇస్తున్న రాయితీలపై అవగాహన కల్పిస్తూ.. ప్రత్యేక ప్రదర్శన నిర్వహించాం.

– పావని, పుష్పలత, మీనాక్షి, బీబీఏ ద్వితీయ సంవత్సరం, ఎంఆర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌స్టడీస్

విపత్తుల వేళ అప్రమత్తత



వరదలు వచ్చేటప్పుడు పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడం ప్రాజెక్టు లక్ష్యం. జీఎస్ఎం సిమ్ (మాడ్యూల్)ను ఉపయోగించి చరవాణి ద్వారా సంక్షిప్త సమాచారాన్ని చేరవేయొచ్చు. రెండు కిలోమీటర్ల వరకు సైరన్ మోగి నష్టం జరగకుండా చూస్తుంది. – పి.మహేష్, కుమారస్వామి, పదో తరగతి, జడ్పీహెచ్‌ఎస్, రామతీర్థం

చిరుధాన్యాల గురించి తెలిసేలా..



ఆహారోత్పత్తుల్లో వరి, గోధుమ స్థానంలో జొన్నలు, సజ్జలు, రాగులు, చోడి వంటి చిరుధాన్యాలకు ఇటీవల కాలంలో డిమాండు పెరుగుతోంది. పోషకాలు ఎక్కువగా ఉండడంతో మొగ్గుచూపుతున్నారు. వాటిలో ఉండే పోషకాలు, సాగు చేసే విధానాన్ని సవివరంగా తెలియజేస్తూ ప్రదర్శన నిర్వహించాం.

– కె.స్వప్న, జి.స్నేహ, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం, మహారాజా కళాశాల

డెంగీ అనుమానిత కేసులపై ప్రత్యేక దృష్టి

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డెంగీ అనుమానిత కేసులు వస్తే ఉన్నత ఆరోగ్య కేంద్రానికి తరలించి, వారి ఆరోగ్య స్థితిగతులపై ప్రత్యేక దృష్టి ఉంచాలని జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ కోరారు. బలిజిపేట మండలంలోని అరసాడ పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని ప్రజల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యాధికారి శశిధర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుభద్ర ఉపకేంద్రాన్ని సందర్శించి, సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. విస్తరణాధికారి నారాయణరావు, రాజేశ్వరి, సామాజిక ఆరోగ్య అధికారి శారద, ఆరోగ్య కార్యకర్త సరస్వతి పాల్గొన్నారు.



దస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ

‘మా భూమిని ఎమ్మెల్యే ఆక్రమిస్తున్నారు’

లోకం నాగమాధవిపై దళితుల ఆరోపణ



గోడ నిర్మాణ పనులు అడ్డుకున్న దళితులు, స్థానికులు

పూసపాటిరేగ/భోగాపురం, న్యూస్‌టుడే: భోగాపురం మండలం ముంజేరు పరిధిలోని తమ భూమిని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆక్రమించడానికి యత్నిస్తున్నారని స్థానిక దన్నానపేట దళితులు ఆరోపించారు. వారి కథనం ప్రకారం.. గ్రామ సర్వే నంబరు 338-4లో 56 సెంట్ల భూమి తండ్రి దన్నాన రాముడు నుంచి వారసత్వంగా అతని కుమారుడు శ్రీనివాసరావుకు వచ్చింది. ఆ భూమిని ఆనుకుని ఎమ్మెల్యేకు చెందిన మిరాకిల్ విద్యాసంస్థల భవన సముదాయం ఉంది. మూడేళ్ల కిందట భూ యజమాని రాముడు మృతి చెందారు. ఆరు నెలల కిందట అతని సంతకం ఫోర్జరీ చేసి రెవెన్యూ దస్త్రాల్లో మార్పులు చేశారని కుమారుడు, దళితులు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యేకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఆ భూమిలో గోడ నిర్మాణ పనులు చేపట్టేందుకు మిరాకిల్ సంస్థ ప్రతినిధులు అధికారులను తీసుకొని బుధవారం రాగా.. స్థానికులు అడ్డుకోగా వెనక్కి వెళ్లిపోయారు. తమ గ్రామానికి చెందిన కొంత మంది దళితుల భూములను కూడా ఎమ్మెల్యేకు చెందిన సంస్థ పేరిట దస్త్రాల్లో మార్చుకునే ప్రయత్నంలో ఉన్నారని ఆరోపించారు. దీనిపై మిరాకిల్ సంస్థ ఎస్టేట్ డైరెక్టర్ వెంకట్ వద్ద ‘న్యూస్‌టుడే’ ప్రస్తావించగా ఆ భూమి మిరాకిల్ సంస్థకు చెందిందని అన్నారు. అందులో గోడ నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. ఇదే విషయమై భోగాపురం తహసీల్దారు సురేష్ మాట్లాడుతూ భూమి వివాదం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. భూహక్కు పత్రాలు పరిశీలించి, సర్వే చేపడతామని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

తండ్రి పెద్దకర్మ.. తనయుడి మృతి

● గాయత్రీనగర్ కాలనీలో విషాదం



రామినాయుడు



చంద్రశేఖర్

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: ఆ కుటుంబంలో రోజుల వ్యవధిలోనే ఇద్దరు మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. తండ్రి దినకార్యానికి సిద్ధమవుతున్న తరుణంలో ముందురోజు రాత్రి కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. పాలకొండ పట్టణంలోని గాయత్రీనగర్‌కు చెందిన విశ్రాంత ఎంఈవో పొదిలాపు రామినాయుడు (79) ఈ నెల 6న అనారోగ్యంతో మృతిచెందారు. 11వ రోజు కర్మకాండ నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు బుధవారం ఏర్పాట్లు చేసుకున్నారు. ఈలోగా ఆయన కుమారుడు పొదిలాపు చంద్రశేఖర్ (42) బుధవారం వేకువజామున అకస్మాత్తుగా మృతి చెందారు. తండ్రి కర్మకాండలు చంద్రశేఖర్ నిర్వహించారు. ఆయన మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్ర మనోవేదనకు గురై తండ్రి దినకార్యం రోజునే తనువు చాలించారు. ఈయన పాలకొండ ప్రాంతీయాసుపత్రిలో ఆరోగ్యశ్రీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వంగర మండలానికి చెందిన రామినాయుడు గత కొద్ది సంవత్సరాలుగా గాయత్రీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఓ వైపు ఇంటి పెద్దను కోల్పోవడం, ఆదుకోవాల్సిన కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగిపోయింది.

క్వారీ గోతిలో పడి కార్పెంటర్ దుర్మరణం



సోమరాజు (పాత చిత్రం)

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలోని బర్మాకాలనీకి చెందిన కార్పెంటర్ కర్రి సోమరాజు (49) బుధవారం ఉదయం ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ క్వారీ గోతిలో పడి మృతి చెందాడు. దీనికి సంబంధించి సీఐ వి.నారాయణమూర్తి అందించిన వివరాల ప్రకారం.. ఉదయం 8 గంటలకు బహిర్భూమికి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు చుట్టుపక్కల వెతకగా సాయంత్రం 5 గంటల ప్రాంతంలో క్వారీ వద్ద నీటి గొయ్యిలో శవమై తేలి ఉన్నాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ జారి పడి చనిపోయినట్లు గుర్తించి భార్య జోగేశ్వరి పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ పీవీ ఆనందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతని భార్య దివ్యాంగురాలు కాగా ఓ కూతురు ఉంది. ఇంటి పెద్ద మృతితో ఆ కుటుంబం ఆధారం లేనిదైంది.

కోనేరులో స్నానానికి వెళ్లి..

రామభద్రపురం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు కోనేరులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన బాడంగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. బాడంగి ఎస్సీకాలనీకి చెందిన కంది రమేష్ (52) బీసీ కాలనీలోని కోనేరులో బుధవారం ఉదయం స్నానానికి దిగారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేయగా కోనేరులో మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై చెప్పారు. ఈ మేరకు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఆసుపత్రిలో క్షతగాత్రులు

పార్వతీపురం పట్టణం, గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలంలో బుధవారం బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఎస్ఐ రమేష్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు.. వీరఘట్టానికి చెందిన ఆటో ప్రయాణికులతో పార్వతీపురం వస్తుండగా పిట్టలమెట్ట సమీపంలో బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వై.యశోదమ్మ(47) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు గాయపడగా జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాముకాటుతో మృత్యువాత

పాచిపెంట, న్యూస్‌టుడే: పాముకాటుకు గురై వ్యక్తి మృతిచెందిన ఘటన పాచిపెంట మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకట సురేష్ వివరాల మేరకు.. పాంచాలికి చెందిన సి.లక్ష్మణరావు(53) బుధవారం ఉదయం తన భార్య సూరమ్మతో కలిసి కాలనీలోని మేకలశాలకు వెళ్లారు. అక్కడ వంట చెరకుపై ఉన్న ప్లాస్టిక్ సీసాను తీస్తుండగా పాము కాటువేసింది. కుటుంబీకులు సాలూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టాలు దాటుతూ..

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం మండల కేంద్రంలోని హడ్కో కాలనీ సమీపంలో పాత రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగి ఉండొచ్చని చెప్పారు. మృతుడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుందని, శరీరంపై తెలుపు రంగు చొక్కా, నీలం రంగు లుంగీ ఉన్నట్లు ఎస్ఐ బాలాజీరావు తెలిపారు.

ఎస్సీఈఆర్టీలో అవకాశాలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ)లో ఫారిన్ సర్వీసు కింద పనిచేయడానికి ఆసక్తి ఉన్న డైట్ సీనియర్ అధ్యాపకులు, అధ్యాపకులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహాయకులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. సెప్టెంబరు 28 నాటికి 15 ఏళ్ల అనుభవం, 58 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని, ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యాల్లో నెలవారీ జీతం 010 పద్దు నుంచి డ్రా చేసినవారు మాత్రమే అర్హులని తెలిపారు.

అవకాశమివ్వాలి: యూటీఎఫ్

ఎస్సీఈఆర్టీలో డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమించే అధ్యాపక పోస్టులకు అర్హత కలిగిన పురపాలక ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఆర్‌సీ పట్నాయక్, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జడ్పీ, ప్రభుత్వ ఉపాధ్యాయులు అర్హులని నోటిఫికేషన్‌లో పేర్కొనడం సరికాదని, సవరణ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	142	254	264

ఆధార్ నవీకరణకు మరో అవకాశం

న్యూస్‌టుడే– రాజాం

ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధికి బ్యాంకు ఖాతా, పాన్‌కార్డు, విద్య, ఉద్యోగాల్లో ప్రవేశాలకు ఆధార్ తప్పనిసరైంది. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య లేకపోయినా.. అందులో సాంకేతిక తప్పిదాలు ఉన్నా.. తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు ఉండాలని, ఇప్పటికే తీసుకుని చాలా కాలమైన వారు నవీకరించుకోవాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా.. చాలా మంది ముందుకు రావడం లేదు. ఆధార్ అవసరమైనప్పుడు ఆ ఇబ్బందులేమిటో తెలిస్తుంది. అప్పుడు ఆదరాబాదరాగా ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈనెల 22 నుంచి 25 వరకు నాలుగు రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. గతంలో ఆధార్ కిట్లు సమకూరిన సచివాలయాలు ఈ సేవలను అందిస్తాయి. పదేళ్లుగా వేలిముద్రలు, నిర్ధిష్ట ధ్రువీకరణ పత్రాలతో ఇతర సమాచారాన్ని నవీకరించుకోని వారు జిల్లాలో లక్షల మంది ఉన్నట్లు గుర్తించారు.



ఈనెల 22 నుంచి ప్రత్యేక శిబిరాలు

చిన్నారి వివరాలు నమోదు చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్

సద్వినియోగం చేసుకోవాలి

ఇంటికి చేరువలోనే శిబిరాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినా సద్వినియోగం చేసుకోవడం లేదు. గతంలో పూర్తి స్థాయి సమాచారం పొందుపర్చకపోవడంతో చాలా వరకూ తిరస్కరణకు గురయ్యాయి. గతంలో ప్రత్యేక శిబిరాల్లో నమోదు చేసుకున్నవారు నిర్ణీత ధ్రువపత్రాలు సమర్పించకపోవడం, ఇతరత్రా సాంకేతిక కారణాలతో 5 నుంచి 10 శాతం తిరస్కరణకు గురైనట్లు గుర్తించారు. తర్వాత సిబ్బందికి శిక్షణ అవసరమని తేల్చారు. ఆధార్ కార్డుకు వయసుతో నిమిత్తం లేదు. అప్పుడే పుట్టిన పిల్లలకు కూడా బాల ఆధార్ తీసుకునే వీలుంది. అయిదేళ్లలోపు పిల్లల వేలిముద్రలు నిక్షిప్తం కావు. అయిదేళ్లు దాటాక వీరంతా బయోమెట్రిక్ నవీకరించుకోవాల్సి ఉంటుంది. ఆధార్ నమోదు చేసుకుని పదేళ్లు దాటిన వారూ తమ వేలిముద్రలు, కనుపాపలు పునర్ స్వీకరణ (రీక్యాప్చరింగ్) చేయించుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ శిబిరాలు కొత్త ఆధార్ కార్డుల నమోదు, వేలిముద్రల నవీకరణ, చిరునామాలు, ఆధార్‌పై వ్యక్తిగత చిత్రం నవీకరణ, చరవాణి సంఖ్య మార్పు, ఇతర దోషాలు పరిహరించుకునేందుకు దోహదపడతాయి. శిబిరాలను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు. సాధ్యమైనంత ఎక్కువ మంది సేవలు అందుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రధానంగా వీరిదే.

వేలిముద్రలు నవీకరించుకోవాల్సిన వారు

జిల్లా	5-15 ఏళ్లు	15-17 ఏళ్లు
విజయనగరం	44,776	68,875
మన్యం	38,086	58,461

మంచి అవకాశం

ఆధార్ సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఇది మంచి అవకాశం. వేలిముద్రల నవీకరణతో పాటు ఇతర ఆధార్ సమస్యల పరిష్కారానికి ఇవి దోహదపడతాయి.

– నిర్మలాదేవి, ప్రత్యేకాధికారిణి, గ్రామ–వార్డు సచివాలయాలు

? చీపురుపల్లిలోని మెట్టకాలనీలో రహదారులు అధ్వానంగా తయారై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలువలు లేక మురుగు పరిసరాల్లో నిలిచిపోతోంది. - **స్థానికులు, మెట్టకాలనీ**

● గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నిధులు కేటాయించారు. త్వరలో పనులు చేపడతాం.

- డి.రమేష్, మండల ఇంజినీరింగ్ అధికారి

– న్యూస్‌టుడే, చీపురుపల్లి

? గొడియాడ ఎస్సీకాలనీ సమీపంలో రహదారిపై చెత్తాచెదారాలు వేయడంతో తీవ్ర దుర్గంధం వస్తోంది. **- స్థానికులు**

● తక్షణమే చెత్తాచెదారాలు తొలగిస్తాం.

- భానోజీరావు, ఈవోపీఆర్డీ

– న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? పోరలి గ్రామానికి ఆనుకొని ఉన్న ఆర్ అండ్‌బీ రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది. **- స్థానికులు**

● సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం. **- రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో**

– న్యూస్‌టుడే, దత్తిరాజేరు

? మర్రివలస గ్రామంలోని కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగి, మురుగు పేరుకుపోయింది. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం.

- స్థానికులు

● పిచ్చి మొక్కలను తొలగించి, మురుగు పారే విధంగా చర్యలు తీసుకుంటాం.

- వెంకటరమణ, ఈవోపీఆర్డీ

– న్యూస్‌టుడే, రామభద్రపురం

? జావాం సమీపంలోని పగడాలమ్మ దేవాలయం వద్ద రహదారిపై గుంతలు ఏర్పడటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

- పగడాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు

● గుంతలను పరిశీలించి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. **- రియాజ్, ఏఈ,**

– న్యూస్‌టుడే, సంతకవిటి

వృథా అరికట్టారు

స్పందనకు వందనం

రేగిడి, న్యూస్‌టుడే: ఆమదాలవలస కాలనీ సమీపంలో రాజాం వైపు లైను ఎయిర్‌హోల్ నుంచి నీరు వృథాగా పోతోంది. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో 'గొంతు తడిపే నీరు నేలపాలు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఏఈ శ్రీచరణ్ స్పందించారు. ఎయిర్‌హోల్ హెడ్‌కు కొత్త పరికరాన్ని అమర్చారు.

చెత్త తొలగింపు..

రాజాం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని సారధి చెవిటి, మూగ పాఠశాల పక్కన కాలువలో చెత్త పేరుకుపోయి.. అధ్వానంగా మారింది. దీనిపై ఈ నెల 14న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సిబ్బందితో చెత్త తొలగింపజేశారు.

ఉత్తీర్ణత ధ్రువపత్రాలు తీసుకోవాలి

చీపురుపల్లి: చీపురుపల్లిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని ఏపీ ఓపెన్ స్కూల్ కేంద్రంలో పది, ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన వారంతా ఈనెల 30లోగా ధ్రువపత్రాలను తీసుకోవాలని కేంద్రం సమన్వయకర్త బి.చంద్రశేఖర్ కుమార్, సహాయ సమన్వయకర్త కె.మురళీధరరావు బుధవారం కోరారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినప్పటికీ చాలా ఏళ్లగా కొందరు ధ్రువపత్రాలు తీసుకోలేదన్నారు. వారంతా ఓపెన్ స్కూల్ కేంద్రంలో సంప్రదించాలన్నారు.

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

గజపతినగరం, న్యూస్‌టుడే: విజయనగరంలో నవంబరు 27 నుంచి 30 వరకు నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విద్యార్థులంతా హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహాసభల గోడపత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. విద్యార్థి సమస్యలపై జరుగుతున్న పోరాటాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి సుమన్, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రులతో విద్యార్థి సంఘం నేతలు

సీబీఎం వ్యవహారంపై దర్యాప్తు చేయాలి

బొబ్బిలి, న్యూస్‌టుడే: సీబీఎం పాఠశాలకు సంబంధించిన భూ బదలాయింపులో ఎంతమేర పారదర్శకత ఉందో సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. బుధవారం బొబ్బిలిలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా ప్రజాసంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయంపై ఆందోళన చేస్తున్నారన్నారు. పట్టణ నడిబొడ్డున ఐదువేల గజాల స్థలానికి బదులు పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోమటిపల్లిలో సుమారు నాలుగు ఎకరాల స్థలం బదలాయింపు చేసుకున్నట్లు క్రయ, విక్రయదారులు చెబుతున్నారన్నారు. పట్టణంలోని పాఠశాల స్థలం సుమారు రూ.50 కోట్లు ఉంటుందని, కోమటిపల్లి స్థలం అక్కడ ఉన్న భూములతో కలిపితే రూ.5 కోట్లు విలువ చేస్తుందని చాలా మంది అంటున్నారన్నారు. భూ బదలాయింపు పారదర్శకంగా జరిగితే బొబ్బిలిలో కాకుండా చీపురుపల్లిలో రిజిస్ట్రేషన్ ఎందుకు చేశారని ప్రశ్నించారు.

వసతులపై సీనియర్ సివిల్ జడ్జి ఆరా

రాజాం, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సేవలపై సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ ఆరా తీశారు. సాంఘిక సంక్షేమ బాలురు, వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ బాలికల వసతి గృహాలను బుధవారం సందర్శించారు. ఆయా చోట్ల మౌలిక వసతులు, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, వాటి నాణ్యత, పరిశుభ్రత, తాగునీరు, వైద్య సదుపాయం తదితర అంశాలు పరిశీలించారు. ప్రభుత్వ న్యాయవాది ఎస్.పోలారావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆర్‌ఈసీహెచ్ జయదేవ్, కార్యదర్శి వై.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్

వదిలేస్తే ఇలా.. ప్రజాధనం వృథా

నిలిచిన గ్రామ సచివాలయాల నిర్మాణాలు



కొండపాలెం (గరివిడి) మేజరు పంచాయతీలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సచివాలయ భవనం నిర్మాణం చివరి దశలో నిలిచిపోయింది. గుత్తేదారుకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశారు. సొంత భవనం అందుబాటులోలేక ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని నిర్వహించారు. 18 నెలలుగా అద్దె చెల్లించలేదని ఆ భవనానికి యజమాని తాళం వేశారు. దీంతో పంచాయతీ కార్యాలయంలోనే సచివాలయం సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది.

చీపురుపల్లి మేజరు పంచాయతీ సంతమార్కెట్‌లో సచివాలయం భవనం దాదాపు 80 శాతం పూర్తయింది. వైకాపా ప్రభుత్వం చివర్లో నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. సొంత భవనం లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.



న్యూస్‌టుడే – గరివిడి

ప్రజలు వద్దకే పాలన తీసుకొస్తామంటూ గత పాలకులు గొప్పలు పలికారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి.. ఆర్భాటంగా నూతన భవనాల నిర్మాణాలు ప్రారంభించారు. అవి పూర్తిచేయకుండా అయిదేళ్లూ నిర్లక్ష్యం చేశారు. చాలా చోట్ల అసంపూర్తిగా నిలిచిపోయాయి. నిర్మాణాలు చేపట్టిన గుత్తేదారులకు బిల్లులు సక్రమంగా చెల్లించక పోవడంతో పనులు నిలిపేశారు. ప్రస్తుత ప్రభుత్వమైనా.. పూర్తిచేసి ప్రజాధనం వృథా కాకుండా చూస్తుందనే ఆశాభావంతో ప్రజలు ఉన్నారు.

నియోజకవర్గంలో ఇదీ పరిస్థితి..

చీపురుపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 83 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు గతంలో చేపట్టారు. ఒక్కో భవనానికి రూ.40 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. వీటిలో 65 పూర్తికాగా.. 18 ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. చీపురుపల్లి మేజరు పంచాయతీలో రెండు సచివాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో వాటిని స్వయం సహాయక సంఘాల సమావేశాలకు నిర్మించిన స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నారు. పర్ల, మెట్టపల్లి, అలజంగిలో సైతం అసంపూర్తిగా ఉన్నాయి. గుర్ల మండలం పెనుబర్తి, గుర్ల, దమరసింగి, కెల్ల, వల్లాపురం, గూడేం, ఆనందపురం పంచాయతీల్లో పనులు పూర్తికాలేదు. గరివిడి మండలం తాటిగూడ, రేగటి అగ్రహారం, శివరాం, గరివిడి-3, మెరకముడిదాం మండలం రామాయవలసలో పరిస్థితి అంతే. పంచాయతీల కార్యాలయాల్లో చాలీచాలని వసతుల మధ్య నిర్వహిస్తున్నారు.

ఉన్నతాధికారుల ద్వారా నివేదిస్తాం..

అసంపూర్తి భవనాల వివరాలను ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తాం. మిగులు పనుల విషయంలో తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ

నిర్లక్ష్యం.. నిరుపయోగం

చెత్తసంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం ఆదేశించి.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా అవగాహన కల్పించినా.. దిబ్బగుడివలస గ్రామంలో మాత్రం పట్టించుకోలేదు. కుండీల్లో పనికిరాని మొక్కలు, తుప్పలు దట్టంగా ఉన్నాయి. ఊరికి దూరంగా ఉండడంతో చెత్త తీసుకెళ్లడానికి హరిత రాయబారులకు కష్టంగా మారిందని, దాంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రం నిరుపయోగంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ భాస్కరరావు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం



అపారిశుద్ధ్యం.. అవస్థలమయం



బొండపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారిలో చెత్త పేరుకుపోయి అధ్వానంగా తయారైంది. సుమారు ఏడాది నుంచి చెత్త తొలగించలేదని, దోమలు, ఈగలు పెరిగి విష జ్వరాలు వ్యాపించే ప్రమాదముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ రఘుపతిరావు వద్ద ప్రస్తావించగా.. చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, బొండపల్లి

బస్సు షెల్టరు లేక ఇక్కట్లు

మండల కేంద్రమైన దత్తిరాజేరులో బస్సు షెల్టరు లేక వర్షానికి, ఎండకి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న షెల్టరు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కూడలి వద్ద ఉన్న దుకాణాల ఎదుట వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. స్థానిక పెద్దలతో, ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. – న్యూస్‌టుడే, దత్తిరాజేరు



వ్యవసాయ కార్యాలయం అధ్వానం



రేగిడిలోని వ్యవసాయ కార్యాలయం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. దీన్ని నిర్మించి రెండు దశాబ్దాలు గడిచాయి. భవనం మొత్తం పాతబడినట్లు కనిపిస్తోంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కార్యాలయం నిరుపయోగంగా వదిలేయకుండా.. మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఏవో మురళీకృష్ణ వద్ద ప్రస్తావించగా.. వినియోగిస్తున్నామని, భవనం కారుతోందని, మరమ్మతులు కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, రేగిడి

ఆర్భాటం చేశారు..

అసంపూర్తిగా వదిలారు

చీపురుపల్లి, గరివిడిలో నిలిచిన రైతుబజార్ల నిర్మాణాలు



న్యూస్‌టుడే – చీపురుపల్లి

గత పాలకులు రెండేళ్ల క్రితం చీపురుపల్లి, గరివిడి పట్టణాల్లో రైతు బజార్ల నిర్మాణాలు ఆర్భాటంగా ప్రారంభించారు. కొంతవరకు చేశాక నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఒక్క అడుగు ముందుకుసాగని దుస్థితి నెలకొంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిర్మాణాలు పూర్తిచేయించి.. అందుబాటులోకి తెస్తుందనే ఆశాభావంతో ప్రజలు ఉన్నారు.

చీపురుపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పాత ప్రాంగణంలోని రైతుబజారు పట్టణానికి దూరంగా ఉండడంతో రెండేళ్ల కిందట తహసీల్దారు కార్యాలయ సమీపంలో రూ.90 లక్షలతో కొత్తది నిర్మాణానికి పనులు ప్రారంభించారు. కొంత వరకు గోడలు నిర్మాణం చేపట్టాక బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అప్పట్లో దీనిపై అధికారులు అంతగా దృష్టిసారించలేదు. ఆ తరువాత రెండు సార్లు నిధులు విడుదలైనట్లు చెబుతున్నారు. అసంపూర్తిగా వదిలేయడంతో తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా తయారైంది.

గరివిడిలో పునాదుల్లోనే..

గరివిడి పట్టణంలో రైతుబజారును నిర్మించాలని చాలా ఏళ్లగా ప్రజలు కోరుతున్నారు. ఎట్టకేలకు రెండేళ్ల కిందట విజయనగరం - పాలకొండ ప్రధాన రహదారికి ఆనుకుని గరివిడి కంటి ఆసుపత్రి ఆవరణలోని ఖాళీ స్థలంలో రూ.75 లక్షలతో పనులను ప్రారంభించారు. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో పనులు పునాదుల్లో నిలిచిపోయాయి. పరిసరాలు తవ్వేసి వదిలేయటంతో ఇబ్బందులు తప్పడంలేదు.

పనులు ప్రారంభమవుతాయ్..

చీపురుపల్లి, గరివిడిలో నిలిచిన రైతుబజార్ల నిర్మాణాలు త్వరలో ప్రారంభమవుతాయి. అసంపూర్తిగా ఉన్న పనులకు మళ్లీ టెండర్లు పిలిచి పనులు చేపట్టే అవకాశం ఉంది.

– డి.రాంబాబు, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, చీపురుపల్లి

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

బాడంగి (రామభద్రపురం), గుర్ల, బొబ్బిలి గ్రామీణం, తెర్లాం, గంట్యాడ గ్రామీణం, రాజాం గ్రామీణం, బొండపల్లి, మెంటాడ, న్యూస్‌టుడే: గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. బుధవారం బాడంగి, గజరాయునివలసలో సీసీరోడ్డు, కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పాల్గొన్నారు. ● రహదారులు అభివృద్ధి చెందితే పారిశ్రామిక వేత్తలు పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వస్తారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. దమర్‌సింగి - చనమలపేట రహదారికి శంకుస్థాపన చేశారు. మాజీ ఎంపీపీ సన్యాసినాయుడు, రామ్‌మల్లిక్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ● బొబ్బిలి మండలం జగన్నాథపురం, చింతాడ, గోపాలరాయుడుపేట, కమ్మవలస, కాశిందొరవలస, కొత్తపెంట గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, తెర్లాం మండలం వి.చిన్నయ్యపేట, అరసబలగ, చీకటిపేట, అప్పలంపేట తదితర పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచులు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ● గంట్యాడ మండలం వసాది, మోకాలుపాడు, రామభద్రపురం గ్రామాల్లోని కార్యక్రమాల్లో ఎంపీడీవో రమణమూర్తి, తెదేపా మండలాధ్యక్షుడు కె.భాస్కరరావు పాల్గొన్నారు. ● రాజాం మండలం గుయ్యానవలసలో ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ● బొండపల్లి మండలం సీటీపల్లిలో సర్పంచి భాస్కరనాయుడు ఆధ్వర్యంలో పల్లెపండగ నిర్వహించారు. ● మెంటాడ మండలంలోని అయిదు గ్రామాల్లో రూ.102.5 లక్షల విలువైన 21 పనులను ఎంపీడీవో కూర్మనాథ్ పట్నాయక్, ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు.



దమర్‌సింగిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళా



గజరాయునివలస: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న బేబినాయన

పోలీసులకు సత్కారం

రాజాం, న్యూస్‌టుడే: నెలరోజుల పాటు కొనసాగిన రాజాం గ్రామదేవత ఉత్సవాలను పోలీసులు శ్రమించి విజయవంతం చేశారని ఉత్సవ కమిటీ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి రాజాం సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్సైలు రవికిరణ్, నరసింహమూర్తి, ఏఎస్సై పి.జనార్దనరావు తదితరులను ఘనంగా సత్కరించారు. నల్ల శ్రీనివాసరావు, పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

సంక్షిప్త సమాచారం

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

బొబ్బిలి: నియోజకవర్గంలోని రైతు అధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కోట అప్పన్నలు డిమాండు చేశారు. నియోజకవర్గంలో మూతపడిన జ్యూట్, చక్కెర పరిశ్రమలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని.. తెరిపించాలని కోరారు.

వైద్య శిబిరం సందర్శన

గుర్ల: గుర్లలో ఏర్పాటు చేసిన అతిసార రోగుల వైద్య శిబిరాన్ని బుధవారం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సందర్శించారు. బాధితులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, శీర అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మెంటాడ: ద్విచక్ర వాహనంపై 25 లీటర్ల నాటుసారాను తరలిస్తున్న వ్యక్తిని బుధవారం గుర్ల గ్రామ శివారులో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆంధ్ర ఎస్సై సీతారాం తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

వంగర: తోటపల్లి పాత ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే కళావెంకటరావు అన్నారు. అధికారులతో మాట్లాడి ఆధునికీకరణ చేపట్టి నీరందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు బి.వాసుదేవురావునాయుడు, పి.వెంకటరమణ ఉన్నారు.

ముగిసిన రాజాం గ్రామదేవత ఉత్సవాలు

రాజాం, న్యూస్‌టుడే: నెలరోజుల పాటు కొనసాగిన రాజాం గ్రామదేవత ఉత్సవాలు ముగిశాయి. బురదల పోలమ్మ అమ్మవారి అనుపు ఘటం సారిధి రహదారిలోని వనం వద్దకు బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో చేరింది. భారీ సంఖ్యలో జనం చేరుకొని పూజలు నిర్వహించారు. అనుపు ఉత్సవం పూర్తి కావడంతో అధికారికంగా రాజాం గ్రామదేవత ఉత్సవం ముగిసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ప్రతి రెండేళ్లకోసారి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ ఉత్సవం నిర్వహిస్తూ వస్తున్నారు. దాదాపు 30గంటల పాటు బురదలపోలమ్మ అమ్మవారి తిరువీధి ఉత్సవం కొనసాగింది. గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడంతో దర్శనాలు సాఫీగా సాగాయని రాజాం సీఐ కె.అశోక్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు.



తిరువీధి ఉత్సవంలో జనసందోహం

అప్రమత్తమైన యంత్రాంగం

గుర్ల, చీపురుపల్లి, న్యూస్‌టుడే: గుర్ల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అతిసార రోగుల వైద్య శిబిరాన్ని బుధవారం కలెక్టరు బీ.ఆర్.అంబేడ్కర్ సందర్శించారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. గ్రామంలోని అయిదు మంచినీటి సొంత బోర్ల వల్ల సమస్య వచ్చిందని అధికారులు చెప్పగా.. వెంటనే వాటిని సీజ్ చేయాలని ఆదేశించారు. వైద్యాధికారులు, సిబ్బంది తగినంత మంది లేరని స్థానికులు కలెక్టరు దృష్టికి తీసుకురాగా.. పూర్తిస్థాయిలో నియమించాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. కొత్తగా కేసులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. డీపీవో వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్, చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణి ఉన్నారు. ● డీసీహెచ్‌ఎస్ రాజ్యలక్ష్మి చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిని సందర్శించారు. ప్రాంతీయాసుపత్రిలో 20 పడకలతో ప్రత్యేక వార్డును సిద్ధం చేయాలని వైద్యాధికారి సుధీర్‌కు సూచించారు. గుర్ల నుంచి వచ్చి చేరిన ఇద్దరు బాధితులతో ఆమె మాట్లాడారు. అనంతరం వైద్యులతో సమావేశమయ్యారు. నాణ్యమైన వైద్యం అందించాలని, ఆరోగ్య పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వార్డులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉంచాలన్నారు.



వైద్యులతో సమావేశమైన డీసీహెచ్‌ఎస్

మద్యం దుకాణాల సరకు స్వాధీనం

గజపతినగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మద్యం దుకాణాల గడువు మంగళవారంతో ముగియడంతో అబ్కారీశాఖ అధికారులు దుకాణాల్లో ఉన్న సరకును స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో సరకు వివరాలు తీసుకున్నారు. దానిని డిస్టలరీలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు గజపతినగరం అబ్కారీశాఖ సీఐ జనార్దనరావు తెలిపారు. నిబంధనల ప్రకారం దుకాణాల దూరాన్ని గుర్తించి అనుమతులు ఇస్తున్నామని, ప్రస్తుతం తాత్కాలికంగా విక్రయాలు జరిపేందుకు అనుమతించినట్లు తెలిపారు.

రోడ్లు, కాలువల నిర్మాణాలకు ప్రాధాన్యం



రాజాం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కీలకమైన మురుగు కాలువల వ్యవస్థ, రహదారుల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే మురళీ మోహన్ తెలిపారు. బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.4,500 కోట్లతో చేపడుతున్న పనులు సంక్రాంతి నాటికి పూర్తవుతాయని, రాజాం నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నిధులు సమకూరాయన్నారు. భూమి పూజలు నిర్వహించి ఇప్పటికే పనులు ప్రారంభించినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం నాలుగు నెలల్లోనే ఇంత పెద్ద ఎత్తున పనులు చేపడుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

విద్యార్థులకు అవగాహన

రేగిడి, న్యూస్‌టుడే: ఉత్తమ వ్యక్తిత్వం యువత ఎదుగుదలకు సోపానం అని యువజన సర్వీసుల శాఖ (సెట్విజ్)ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.వి.రమణ అన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆదేశాలు మేరకు మండలంలోని అంబేడ్కర్ గురుకుల కళాశాల, సంకిలి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, సైబర్ నేరాలు, డ్రగ్స్ తదితర విషయాలపై బుధవారం అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న కె.వి.రమణ

గ్రంథాలయం ఏర్పాటు



ప్రారంభోత్సవంలో డిప్యూటీ డీఈవో, ఉపాధ్యాయులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: ప్రవాస భారతీయుల వాసవి సంఘం లెర్న్ అండ్ హెల్ప్ అధినేత ఐనా శివరామకృష్ణ సహకారంతో గొల్లపల్లి వేణుగోపాల పురపాలక పాఠశాలకు రూ.50 వేల పుస్తకాలు సమకూరాయి. దీంతో పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. దానిని బుధవారం డిప్యూటీ డీఈవో కె.మోహనరావు ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో వంటలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

వరిపంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు పంటలకు అధికంగా పురుగు మందులు వాడకూడదని బొబ్బిలి డివిజన్ ఏడీఏ శ్యామ్‌సుందర్ అన్నారు. బుధవారం ఎం.బూర్జివలసలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా విజయనగరం రైతు శిక్షణా కేంద్రం సహాయ సంచాలకుడు చంద్రశేఖర్‌బాబుతో కలిసి వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం సోకుతున్న అగ్గి తెగులు, దోమపోటు నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణా చర్యలను వివరించారు. ఉద్యానవన శాఖాధికారి వెంకటరత్నం, వ్యవసాయ సహాయకురాలు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి ఉచిత ఇసుక

తెర్లాం, న్యూస్‌టుడే: ప్రజలకు అవసరమైన ఇసుక అందుబాటులో ఉందని, కావలసిన వాళ్లు తీసుకెళ్లాలని గనులు, భూగర్భ శాఖ డీడీ నర్శింహారెడ్డి, ఉప తహసీల్దారు జి.సత్యనారాయణ అన్నారు. బుధవారం కుసుమూరు వేగావతి నది సమీపంలో ఇసుక రేవు ప్రారంభించారు. రీచ్‌లో ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేకపోయినప్పటికీ అవతల వైపు నుంచి ఇసుక తెప్పించి డంప్ చేస్తున్నామన్నారు. వేగావతినదిలో నీరు తగ్గిన తరువాత ఇసుక అందుబాటులోకి వస్తుందని, అప్పుడు తవ్వి తీసుకోవచ్చని చెప్పారు.



రీచ్ ప్రారంభిస్తున్న గనులశాఖ డీడీ, రెవెన్యూ అధికారులు

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

స్టాఫ్ నర్సుల సంఘం ఎన్నికలు షురూ..



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పోటీదారులు

విజయనగరం వైద్య విభాగం: స్టాఫ్ నర్సుల సంఘం ఎన్నికలు ఈనెల 23న జరగనున్నాయి. అందులో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్ షేక్ రిజ్వాన్‌ను ఎన్నికల అధికారిగా ప్రభుత్వం నియమించింది.

మైదానం కాదు.. చెరువే!

ఇదేదో క్రీడా మైదానమని అనుకుంటే పొరపాటే.. పచ్చని గడ్డిని పరుచుకుని మైదానంలా కనిపిస్తున్నది చెరువే. ఎ.రావివలస కూడలి నుంచి సన్‌రే రిసార్ట్స్‌కు వెళ్లే రహదారిలో ఉంది. ఉదయం ఇలా పచ్చగా పరుపు వేసినట్లుగా కనిపించే ఈ చెరువులో సాయంత్రం నీరు కనిపిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు చుట్టుపక్కల కాలువల నీరు చేరడంతో నాచుపట్టి ఇలా కనిపిస్తోంది. – న్యూస్‌టుడే, భోగాపురం



మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	80085 74319

?: స్థానిక స్టేడియం రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర లీకు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. చర్యలు తీసుకోవాలి. **- స్థానికులు**

❖ అక్కడ పరిశీలించి చర్యలు తీసుకుంటాం

- ఎస్.అప్పారావు, డీఈఈ, నగర పాలక సంస్థ

?: వుడాకాలనీ ఫేజ్-2, పాల్‌నగర్ దారిలోని అబ్దుల్ కలాం విగ్రహం తీసిన దగ్గర గోతిని పూడ్చాలి. **- స్థానికులు**

❖ అక్కడ ప్యాచ్ వర్క్ పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

- పి.నల్లనయ్య, కమిషనరు, నగర పాలక సంస్థ

–న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

?: భోగాపురంలోని పంచాయతీ కార్యాలయం నుంచి కనకదుర్గమ్మ ఆలయం వరకు రహదారి పూర్తిగా ఛిద్రమైంది. **- అప్పారావు, స్థానికుడు**

❖ రహదారి మరమ్మతులపై సమీక్షిస్తాం.

- కిశోర్‌కుమార్, ఎంపీడీవో – న్యూస్‌టుడే, భోగాపురం

కాలువలు శుభ్రం చేశారు

స్పందనకు వందనం

స్థానిక కొత్తగ్రహారంలో కాలువలు శుభ్రం చేశారు. మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన స్థానికులు ఫిర్యాదు చేశారు. సమస్యను ప్రజారోగ్య అధికారి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

తగ్గించిన బియ్యం తిరిగి ఇచ్చారు



లక్కవరపుకోట, న్యూస్‌టుడే: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తున్న రేషన్ తగ్గించి ఇస్తున్నారని ఆరోపణలతో బుధవారం ఈనాడులో ప్రచురితమైన 'రేషన్ బియ్యం ఎందుకు తగ్గించారు' కథనంపై తహసీల్దార్ ప్రసాదరావు స్పందించారు. తగ్గిన బియ్యం వెంటనే సరఫరా చేయాలని డిపోవారికి ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో జయహో

జాతీయస్థాయిలో ఆరు పతకాలు కైవసం

అంతర్జాతీయ స్థాయిలో రాణింపు..



ప్రస్తుతం సికింద్రాబాద్ ఆర్మీ డిఫెన్స్ ఆకాడమీలో చదువుకుంటూ వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ కొనసాగిస్తున్నాను. 2022లో మెక్సికోలో జరిగిన యూత్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం, 2020 ఉజ్బెకిస్తాన్‌లో యూత్ ఏషియాన్‌షిప్‌లో కాంస్యం, 2023 యూపీ నోయిడాలో జరిగిన కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం గెలుచుకున్నాను. ప్రస్తుతం జాతీయస్థాయి జూనియర్ విభాగంలో స్నాచ్ 105 కిలోల, క్లీన్‌అండ్‌జర్క్‌లో 130 కలిపి 235 కిలోల బరువును ఎత్తి రజత పతకం సాధించాను.

– శనపతి గురునాయుడు, చంద్రంపేట

శిక్షకుడి సహకారంతో..



కొండవెలగాడ గ్రామానికి చెందిన శిక్షకుడు చల్లా రాము సహకారంతో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడపై ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం జూనియర్ విభాగంలో 73 కిలోల కేటగిరిలో 117 కిలోల స్నాచ్, 156 కిలోల క్లీన్‌అండ్‌జర్క్ కలిపి 274 కిలోల బరువులు ఎత్తి కాంస్య పతకం సాధించాను.

– కె.అనిల్‌కుమార్, చంద్రంపేట

నెల్లిమర్ల మండలం కొండవెలగాడకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ గ్రామానికి చెందిన పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో ఉన్నతంగా రాణిస్తున్నారు. వెయిట్ లిఫ్టింగ్ అంటే వీరికి మక్కువ. ఈ పోటీలకు నిత్యం సాధన చేస్తుంటారు. ఎక్కడ ఏ స్థాయిలో పోటీలు జరుగుతున్నాయని తెలిసినా అక్కడ తమ ప్రతిభను ప్రదర్శిస్తారు. పతకాల పంట పండిస్తూ గ్రామస్థుల ప్రశంసలు సొంతం చేసుకుంటున్నారు. క్రీడారంగంలో గొప్పగా రాణిస్తుండటంతో వివిధ ప్రభుత్వ శాఖల్లో కొలువులు కూడా సాధిస్తున్నారు. ఈ నెల 6 నుంచి 13 వరకు జరిగిన ఐడబ్ల్యూఎల్ఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రానికి పతకాల పంట పండించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో ఆరు పతకాలు గెలుచుకున్నారు. –న్యూస్‌టుడే, నెల్లిమర్ల

కామన్‌వెల్త్‌లో విజయమే లక్ష్యంగా..



అంతర్జాతీయ కామన్‌వెల్త్ గేమ్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నాను. ప్రస్తుతం జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో 64 కిలోల కేటగిరిలో 78 కిలోల స్నాచ్, 101 కిలోల క్లీన్‌అండ్‌జర్క్ కలిపి 179 కిలోల బరువులెత్తి రజత పతకం సాధించాను.

– వి.హారిక, కొండవెలగాడ

తండ్రి ప్రోత్సాహంతోనే



నా తండ్రి రమణ ప్రోత్సాహంతో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నాను. ప్రస్తుతం జాతీయ పోటీల్లో 49 కిలోల విభాగంలో, జూనియర్ విభాగంలో 71 కిలోల స్నాచ్, 92 కిలోల క్లీన్‌అండ్‌జర్క్ కలిపి 163 కిలోల బరువు ఎత్తి రజత పతకం సాధించాను.

– బి.చంద్రిక, నెల్లిమర్ల

సీనియర్ల స్ఫూర్తితో..



కొండవెలగాడలో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారుల స్ఫూర్తితో వెయిట్ లిఫ్టింగ్ క్రీడపై ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం జరుగుతున్న జాతీయ పోటీల్లో 68 కిలోల కేటగిరిలో సబ్‌జూనియర్ విభాగంలో 117 కిలోల స్నాచ్, 138 కిలోల క్లీన్‌అండ్‌జర్క్ కలిపి 255 కిలోల బరువు ఎత్తి కాంస్య పతకం సాధించాను.

– కె.దినేష్‌కుమార్, కొండవెలగాడ

కుటుంబ సభ్యుల సహకారంతో..



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నాను. ఇటీవల ఫిజీలో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో రజతం, ప్రస్తుతం జాతీయస్థాయిలో 49 కిలోల కేటగిరిలో సబ్‌జూనియర్ విభాగంలో 68 కిలోల స్నాచ్, 86 క్లీన్‌అండ్‌జర్క్ కలిపి 154 కిలోల బరువు ఎత్తి రజత పతకం గెలుచుకున్నాను.

– బి.భార్గవి, కొండవెలగాడ

పుట్టినరోజు నాడు మరొకరికి పునర్జన్మ



రక్తదాతను అభినందిస్తున్న నిర్వాహకులు

విజయనగరం రింగురోడ్డు: తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి పునర్జన్మ ఇచ్చేందుకు జన్మదిన వేడుకలను పక్కన పెట్టిన రక్తదాత రామ్‌కుమార్‌ను జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఉపాధ్యక్షుడు కె.దయానంద్ అభినందించారు. 19 ఏళ్ల ధనుష్‌కు ప్లేటులెట్స్ పడిపోవడంతో తీవ్ర రక్తస్రావమై బుధవారం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. సింగిల్ డోనర్ ప్లేటులెట్స్ ఎక్కించాలని వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రవూఫ్‌ను సంప్రదించారు. దీనికి రామ్‌కుమార్ స్పందించి రక్తమిచ్చారు. గతంలోనూ ఆయన ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేశారని పలువురు ప్రశంసించారు.

జాతరలో హుందాతనం అవసరం



మాట్లాడుతున్న సీఐ లక్ష్మణరావు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: గ్రామదేవత పండగలో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా హుందాతనంగా వ్యవహరిస్తూ పండగను సరదాగా జరుపుకోవాలని గ్రామీణ సర్కిల్ సీఐ బి.లక్ష్మణరావు సూచించారు. త్వరలో కొండకరకంలో గ్రామదేవత పండగ జరగనుంది. అందులో భాగంగా బుధవారం సాయంత్రం గ్రామస్తులతో సమావేశమయ్యారు. అందరి సహకారం కావాలని, ఎటువంటి ఇబ్బందులు ఉన్నా చెప్పాలని సూచించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, గంజాయి తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికలు

పూసపాటిరేగ/భోగాపురం: మండలంలోని ముంజేరు ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి పోటీలకు బుధవారం ఎంపికలు జరిగాయి. అండర్-17 విభాగంలో 70 మంది బాల, బాలికలను వివిధ పోటీలకు తీసుకున్నారు. విజ్జీ మైదానంలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ జి.రమణామూర్తి, మండల క్రీడ సమన్వయకర్త ఎస్.నాగన్న తెలిపారు.

తాగునీరు వృథా

నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ప్రాంతం లక్ష్మీదేవిపేటలో తాగునీటి పైపులైను మరమ్మతులకు గురైంది. దీని వల్ల నీరు వృథాగా పోతోంది. కాలువ పక్కనే పైపులైను ఉండటంతో నీళ్లు కలుషితమవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని నగరవాసులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజా మాట్లాడుతూ.. ఇటీవల కాలువలో పూడిక తీతను తొలగించేందుకు చర్యలు చేపట్టిన సమయంలో పైపులైను మరమ్మతులకు గురైందని, బాగు చేయిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, నెల్లిమర్ల



జిల్లా సమన్వయకర్త ఆకస్మిక తనిఖీ



దస్త్రాలు తనిఖీ చేస్తున్న జిల్లా సమన్వయకర్త

వేపాడ, న్యూస్‌టుడే: మండలంలోని బక్కునాయుడుపేట అంబేడ్కర్ గురుకుల పాఠశాలను జిల్లా సమన్వయకర్త టి.ఎం.ఫ్లోరెన్సు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములోని ఆహార పదార్థాల నిల్వలు పరిశీలించి, విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ నెల 18న నెల్లిమర్లలో జరగబోయే సైన్సుఫేర్‌కు జిల్లాలోని 13 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని కోరారు.

ఇదేం చెత్త తరలింపు?

దాసన్నపేట రింగ్‌రోడ్డు ట్రాన్సిట్ స్టేషన్ సమీపంలో చెత్త పేరుకుపోయి మినీ డంపింగ్ యార్డును తలపిస్తోంది. పందులు, కుక్కలు, పశువులు చేరి సమస్యను జఠిలం చేస్తున్నాయి. పరిసర ప్రాంతాల్లో శ్రీనివాసనగర్, ప్రశాంతినగర్, రామకృష్ణా నగర్ తదితర కాలనీలున్నాయి. సేకరించిన చెత్తను ఇక్కడ డంప్ చేసి విశాఖ జిందాల్ ప్లాంటుకు తరలిస్తారు. చుట్టూ ప్రహరీ నిర్మాణం జరిగినా వినియోగించడం లేదు. అక్కడ పూర్తిస్థాయిలో చెత్త తరలింపునకు చర్యలు తీసుకుంటామని ప్రజారోగ్య అధికారి డాక్టరు కొండపల్లి సాంబమూర్తి తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం



ఈ రహదారిలో నడవలేం..



భోగాపురం మండలంలోని జాతీయరహదారి నుంచి చాకివలసకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ఛిద్రమైంది. ఎక్కడికక్కడ రాళ్లు పైకి తేలి వర్షం పడితే నీరు నిల్వ ఉండిపోతోంది. సుమారు ఐదారు గ్రామాలకు ఇదే రహదారి కావడంతో వాహన చోదకులు అవస్థలు పడుతుంటారు. రహదారికి ఇరువైపులా పనికి రాని మొక్కలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎంపీడీవో కిశోర్‌కుమార్ వద్ద ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాను. – న్యూస్‌టుడే, భోగాపురం

పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలి: ఎంపీ కలిశెట్టి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: గుర్లలో నెలకొన్న పరిస్థితిని అదుపులోకి తేవాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆదేశించారు. మరణాలపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం దిల్లీ నుంచి జిల్లా కలెక్టర్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో ఫోన్‌లో సంప్రదించారు. బాధితుల పరిస్థితి, చికిత్స వివరాలు తెలుసుకున్నారు. దిల్లీలో బుధవారం నిర్వహించిన ఎగ్జామినేషన్ ఆఫ్ డిమాండ్ ఫర్ గ్రాంట్స్ 2024-25 సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పల్లె పండగతో గ్రామాల్లో వెలుగులు



భూమిపూజ చేస్తున్న మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు, ఎమ్మెల్యే మాధవి

కొత్తవలస, నెల్లిమర్ల, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' కార్యక్రమం గ్రామాల్లో వెలుగులు తెస్తుందని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. కొత్తవలస మండలంలోని నిమ్మలపాలెం, దేవాడ, గొల్లలపాలెం పంచాయతీల్లో సుమారు రూ.41 లక్షలు అంచనాతో చేపట్టనున్న సిమెంటు రహదారులు, కాలువల నిర్మాణ పనులకు బుధవారం ఆమె కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో సంతోషం నింపేందుకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ❖ ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులకు మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి శంకుస్థాపన చేశారు. బుధవారం కుమిలిలో పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా పలు పనులకు భూమి పూజ చేశారు. గతంలో తెదేపా హయాంలో చంద్రన్నబాట కార్యక్రమంలో భాగంగా రహదారుల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు.



కొబ్బరికాయ కొట్టిన ఎమ్మెల్యే లలితకుమారి

20 మంది రక్తదానం

కొత్తవలస: మండలంలోని గులివిందాడలో బెస్ట్ ఫ్రెండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవల్ని ఎమ్మెల్యే లలితకుమారి ప్రశంసించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించారు. 20 మంది రక్తదానం చేశారు. 42 మందికి ఆరోగ్య తనిఖీలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు.

జడ్పీటీసీ మాజీ సభ్యుని మృతికి సంతాపం

డెంకాడ, న్యూస్‌టుడే: విలువలతో కూడిన రాజకీయ నాయకుడుగా జడ్పీటీసీ మాజీ సభ్యుడు బడ్డుకొండ జనార్దనరావు కీర్తిని గడించారని మాజీ ఎమ్మెల్యే అప్పలనాయుడు అన్నారు. ఆయన చిత్రపటానికి అప్పలనాయుడు, ఎంపీపీ వాసుదేవరావుతో సహా పలువురు నాయకులు బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు.

విధుల్లో చేరిన అధికారులు

విజయనగరం పట్టణం: టిడ్కో ఈఈగా డీవీ రమణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్.జ్యోతి ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఈఈగా చేరారు. నగరపాలక సంస్థలో సహాయ సిటీ ప్లానర్‌గా ఎన్.హరిబాబు బాధ్యతలు స్వీకరించారు. టీపీఎస్‌గా సీహెచ్ అనిత బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

లక్కవరపుకోట: మల్లివీడు పరిధిలోని జమ్మాదేవిపేట, రంగాపురం, వేచలపువానిపాలెం, గేదెలవానిపాలెం, గనివాడ, రెల్లిగౌరమ్మపేట, శ్రీరాంపురం, కొత్తపాలెం, తామరాపల్లి, మార్లాపల్లి చందులూరు, కిత్తన్నపేట, దాసుళ్లపాలెం గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

స్కౌట్సు అండ్ గైడ్స్‌కు అభినందనలు

విజయనగరం రింగురోడ్డు, న్యూస్‌టుడే: విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి జాతర సందర్భంగా రాజీవ్ మైదానంలో నిర్వహించిన బెలూన్ షో, ఇతర కార్యక్రమాలు విజయవంతం చేయడంలో స్కౌట్సు అండ్ గైడ్స్ విద్యార్థులు విశేషమైన సేవలందించారని సెట్విజ్ సీఈవో బి.రాంగోపాల్ కొనియాడారు. ఈ సందర్భంగా బుధవారం వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.




స్కౌట్సు అండ్ గైడ్స్‌తో సీఈవో రాంగోపాల్

నేడు డయల్ యువర్ డిపో మేనేజరు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ఎస్.కోటలో పట్టణంలోని ఆర్టీసీ సముదాయంలో గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజరు కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రయాణికులు, ఇతరులు తమ సమస్యలను తెలియజేయాలని డిపో మేనేజరు కె.రమేష్ సూచించారు. మరిన్ని వివరాలు తెలుసుకోవడం కోసం డిపో మేనేజరు 99592 25619, సూపరింటెండెంటు 73829 23679 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఉత్తరాంధ్ర బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం



అతిథుల చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న మౌనిక, హారిక

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పట్టణంలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన క్రీడాకారులు బి.హారిక, పి.మౌనిక ఉత్తరాంధ్ర బ్యాడ్మింటన్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. విజయనగరం పైడితల్లమ్మ జాతర సందర్భంగా సోమవారం విజ్జీ మైదానంలో పోటీలు నిర్వహించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంలో నిర్వహించిన ఈ పోటీల్లో రెండోస్థానంలో నిలిచిన వీరికి ట్రోఫీ, రూ.7000 నగదు అందించారని అకాడమీ చీఫ్ కోచ్ పి.శ్రీరాములు తెలిపారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

విజయనగరం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరంలో పాత బస్టాండ్ సమీపంలో అదుపు తప్పిన కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఇందులో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కారులో ఉన్న వ్యక్తులు పరారైనట్లు తెలుస్తోంది. ఫిర్యాదు అందుకొని కేసు నమోదు చేస్తామని రెండో పట్టణ పోలీసులు పేర్కొన్నారు.



సంఘటన ప్రాంతంలో ద్విచక్ర వాహనం, కారు

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన వత్సవాయి నరేష్ నాకు ఇచ్చిన భోగట్టాపై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ తే. 25-09-2024దీన ఆర్.టి.సి కాంప్లెక్స్, విజయనగరం వద్ద ఒరిజినల్ క్రయ దస్తావేజు నెం. 3267/2012, తేదీ. 13-06-2012 గలది పోగొట్టుకొన్నారు. సదరు దస్తావేజు ఆత్తి రామునాయుడు వగైరాలు గూడేల గోపాలరావు గారికి క్రయ పరచిన షెడ్యూలు ఆస్థికి సంబంధించిన లింక్ దస్తావేజు అయిఉన్నది. మరియు సదరు షెడ్యూలు ఆస్థిని నా క్లయింట్ వత్సవాయి నరేష్ క్రయ దస్తావేజు 2259/2018, తేదీ. 03-04-2018 ద్వారా గూడేల గోపాలరావు వద్ద నుండి కొనుగోలు చేసి పూర్తి హక్కు, అనుభవదారులు అయిఉన్నారు. దరిమిలా విజయనగరం 1 టౌన్ పోలీసు వారికి తే. 28-09-2024 దీన రిపోర్టు ఇవ్వగా వారు సదరు దస్తావేజు నెం. 3267/2012, తేదీ. 13-06-2012 దొరకలేదని తే. 01-10-2024దీన సర్టిఫికేటు ఇచ్చియున్నారు. సదరు షెడ్యూలు ఆస్థిని నా క్లయింట్ వత్సవాయి నరేష్ గారు గొల్లు సునీత W/o. T. సురేష్ గారికి అమ్మజూపుచున్నారు. సదరు విక్రయమునకు మరియు సదరు కొనుగోలు దారు స్టేట్ బ్యాంక్, అల్లిపురం శాఖ/RACPC-1, విశాఖపట్నం వారికి గృహ ఋణం నిమిత్తం తాకట్టు పెట్టుకొనుటకు ఏమైనా ఆక్షేపణలు యున్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన నాటి నుండి 15 రోజులలోగా నన్ను వ్రాతపూర్వక సాక్ష్యములతో సంప్రదించవలెను. లేనిచో సదరు ఆస్థిని నిరభ్యంతరకర ఆస్తిగా భావించబడును.

షెడ్యూలు: విజయనగరం జిల్లా, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల జమ్మునారాయణపురం గ్రామం, శ్రీ సాయినగర్ లే-అవుట్, ప్లాట్ నెం: 20, సర్వే నెం: 132/40 భా, రెండు అంతస్థుల ఇల్లు 2164 చ॥అ॥ మరియు 200 చ॥గ॥ స్థలం ఆస్థికి హద్దులు: తూర్పు: ప్లాటు నెం. 19, దక్షిణం: ప్లాటు నెం. 43, పడమర: ప్లాటు నెం. 21, ఉత్తరం: లే-అవుట్ రోడ్డు.

ధవళ వెంకటరావు, అడ్వకేట్
విజయనగరం. Ph: 9440194894

పాడిరైతుల సదస్సు జయప్రదానికి పిలుపు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: పాడిరైతులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలియజేయడానికి ఈ నెల 18న నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శి రమణ కోరారు. బుధవారం కృష్ణాపురంలో పాడి రైతుల సదస్సు గోడపత్రికను రైతులతో కలిసి ఆవిష్కరించారు. పాల సేకరణ కనీస ధరపై లీటరుకు రూ.10 పెంచాలని, దీనికి అదనంగా ప్రభుత్వ రూ.8 ప్రోత్సాహకం అందించాలని కోరుతున్నారు. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న పాలపొడిని నిషేధించాలని, యంత్రాలపై జీఎస్టీ తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. సిటు నాయకులు సి.ముత్యాలు, కె.గణేష్, పెదగాడ అప్పలసత్యం తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

బాధితులకు అందుతున్న సేవలపై ఆరా



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావు

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: గుర్లలో అతిసారం ప్రబలిన నేపథ్యంలో మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 20 మంది బాధితులను బుధవారం ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు పరామర్శించారు. గ్రామంలో అతిసారం ఉత్పన్నమయ్యే పరిస్థితులు, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నవారిని ఆయన పరామర్శించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయి ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయం చేసి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి


డెంకాడ, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ఎమ్మెల్యే నాగమాధవి తెలిపారు. డెంకాడ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామాల్లో పాడి పశువులు, గొర్రెల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని మాధవి కోరారు. జొన్నాడ పంచాయతీ మన్యాలపేటలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధితులపై వైద్యాధికారులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

29 నుంచి వైద్యసేవ క్షేత్ర సిబ్బంది సమ్మె

విజయనగరం రింగురోడ్డు: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సిబ్బంది సమస్యలు 17 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదని ఏపీ వైద్యమిత్ర ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జె.ప్రదీప్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లపై ఉన్నతాధికారులకు ఇప్పటికే వినతిపత్రం అందజేశామని, ఈ నెల 29న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి వెళుతున్నట్లు తెలిపారు.

పొట్టదశలోని వరిపై ఎండు తెగులు

భోగాపురం, న్యూస్‌టుడే: ఈ ఏడాది భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులంతా ప్రస్తుతం వరి పంటపై పెరుగుతున్న తెగుళ్ల బెడదతో తల్లడిల్లుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో వరి వేశారు. మరో నెల రోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో వరిమానులు ఎండిపోవడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండటం లేదని, దిగుబడులు తగ్గి నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. భోగాపురం మండలంలో సుమారు 200 ఎకరాలకు పైగా తెగులు సోకినట్లు గుర్తించామని వ్యవసాయాధికారి హరికృష్ణ తెలిపారు.



సుందరపేట వద్ద తెగుళ్లు సోకిన వరిపంట